ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జులై 2017

సంపుటి : 23 **270** సంచిక : 7

దేహధర్మమూ, దేశ ధర్మమూ ఒక్కటే!

శ్వాసను పీల్చి, విడిచే ఊపిరితిత్తులూ, నాడుల నాడించే నాడీ మండలమైన 'గుండె కుహరము'లు శరీరమునకు ముఖ్యమైననూ ఇంకనూ శరీరంలోని జ్ఞానేంద్రియాలైన రెండు కళ్ళూ, రెండు చెవులూ, ముక్కుపుటలూ, మాటలకు నోటి మధ్యగల నాలుకా, మూడు వైపులా ప్రాకారములైన ముప్ఫైరెండు పళ్ళూ ఆరోగ్యంతో ఉండగలిగితేనే శరీరము ఆరోగ్యమూ ఆరోగ్యవంతమైన శరీరుడు కాగలుగుతాడు.

ఈ శరీరాన్ని నడిపించకలిగే కాళ్ళూ, ఆహారాన్ని భుజించడానికి, విసర్జించిన మలిన ఆహారాన్ని శుభ్ర పరచుకోవడానికి కుడి ఎడమ చేతులూ కావాలి.

ఇవన్నీ అన్నీ తామే చేసుకుంటూ పోతున్నాయని విర్రవీగకుండా ఉండేట్టు- ఈ చేతికీ ఆ చేతికీ, ఆ కాలిపాదానికీ ఈ కాలిపాదానికీ అయిదయిదు వేళ్లను సృష్టించాడు. అవే శరీర కార్యమంతా చేస్తున్నామని విర్రవీగకుండా ఆ వేళ్లలో కొన్ని పొట్టివిగానూ, కొన్ని పొడువుగానూ కల్పించి, మేము అగ్రశ్రేణి, మేము వెనుక శ్రేణి అంటూ విర్రవీగవద్దనీ, శరీరంలోని ప్రధాన అవయవముల్లా తలంచవద్దనీ, అగ్రశ్రేణీ, వెనుక శ్రేణీ అంటూ లేదనీ, పరస్పర తోడ్పాటు లేకపోతే ప్రాణి సంపూర్ణారోగ్యుడు కాలేడనీ, సృష్టించిన ప్రతీ అవయవమూ - పొడుగూ పొట్టీ, సన్నమూ, లావూ అర్హత, అనర్హతా అహములను పులుముకుంటూ పొంగరాదనీ, అంగం నుంచీ రక్తపుబొట్టు రాలినా, ఏ అవయవానికి రుగ్మత కల్గినా శరీరమంతా కట్టుకుని బాధపడే ప్రమాదమూ, అది తీవ్రతను చెంది, సంపూర్ణ శరీరం విసుగుబాటుతో దహనమయ్యే ప్రమాదముంది సుమా అన్నాడు సృష్టికర్త. పైగా నీకు దేహము అని పేరు పెట్టినది దహించుకుని పోయేది అని చెప్పడానికే సుమా- జాగ్రత్త- టేక్ కేర్ అన్నాడు.

శరీరంలోని వేలు వేలు అవయవాలు వేర్వేరు పేర్లతో పనిచేస్తూ ప్రవృత్తులు కల్పించినట్లే, నీకూ, మీకూ కల్పించాను, ఏదైనా అగ్ర అవయవమని కీడు తల పెట్టినా, ఉపేక్షచేసినా, మొత్తం శరీరమే నశిస్తుందని 'బ్రహ్మ'గారు ఎదురుగా నిలబడి హెచ్చరించి ఖబడ్దార్ అనినట్లు ఓ కల గన్నాను. దేహధర్మం లాంటిదే దేశధర్మమని నేపథ్యంలో విన్నాను.

బుధజన విధేయుడు

- గోటేటి శ్రీరామారావు

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

గోవర్ధనోద్ధార గోవులను కాచినవాడా!
పాలూ వెన్నెలతో బలిష్టుణ్ణి చేసే గోవధను అరికట్టలేవా?

- గోవును జాతీయ ఆరాధక పశువుగా గుర్తించనివారందరూ పశుహంతకులే!
- పాముని పట్టి చంపకూడదనే వాడివి గోవునెలా వధిస్తావ్!
గోవధ నరికట్టే చట్టం చేయని పాలకులు పాలకులే కారు!

గోవులను వధిస్తూ గోమాసం తినేవారిని శిక్షించాలి. గోమాతను ఆజత ఆరాధక పశువుగా ప్రకటించాలి. గోవర్ధనగిరి యెత్తిన కృష్ణునిగా గో సంరక్షణం జరగాలి. తరతరాలుగా వస్తున్న తాత్విక చింతనను తాకట్టుపెట్టాం భారతదేశం భిన్న సంస్కృతీపరులున్న ఒకే జాతి. ఒకే దేశం! ఒకే కుటుంబం! ఒకటిగా జీవించాలనే సుస్థిరభివృద్ధి ఆశయానికి గండికొట్టాం.

భారత సంస్కృతి విశ్వజనీన ప్రగతిని కోరే సంస్కృతి! విభిన్న భాషలవారు! విభిన్న సంస్కృతివారు! వివిధ జాతులవారూ వసుదైక కుటుంబీకుల మనే భావనతో ఏక దేశంగా, ఏక కుటుంబంగా వర్ధిలాల్లని వనరులను వనాలను అభివృద్ధిపరచుకోవడంలో ఒక్కొక్కరు వారువేరు అనే భావనను వేళ్ళూనకుండా చేసుకున్నారు.

బంగారు భవితకు పృథ్వి వంటి ప్రభువులు భారతదేశాభివృద్ధికి పునాదులు వేసారు. సగరుడు వంటి చక్రవర్తులు పృథ్వీ వేసిన బాటలను జనైక ఆరామాలుగా తీర్చిదిద్దారు.

శ్రీరాముడు రాజ్యానికి వచ్చిన అనన్తరమ్ సుభద్ర జనజీవనానికి పునాదులు వేసింది. రామరాజ్యం సంక్షుభిత స్థితిని సమ్మూలంగా మాన్పివేసింది. జనులు ఘర్షణాత్మకంగాగానీ వర్గంగా గానీ వేర్పాటు భావకులు కాలేదు, క్షుద్బాధా పీడితులు లేరు. వివిధ వృత్తుల్లో వృత్తి నైపుణ్యంతో ఒక ఆదర్శ సామ్రాజ్యం వర్ధిల్లింది. జాతిపిత గాంధీ గారు స్వాతంత్ర్యం సిద్ధించిన భారతదేశం రామరాజ్యం వంటి ఆదర్శ గ్రామరాజ్యంగా వర్ధిల్లాలని భావించారు. కలలు గన్నారు. 'రామ రాజ్యం'లో అందరికీ అందరూ అందరూ అందరికి అనే సౌమ్య సిద్ధాంతంతో ఒకే కుటుంబంగా మెలిగారు.

విశ్వకుటుంబం భావన అప్పుడే ఉదయించింది. భారతదేశం భరత ఖండంగా వర్ధిల్లింది. వసుదైక కుటుంబ భావనం అప్పుడే కుసుమించినదే.

ఈనాటి ప్రజాస్వామ్యం ఆనాటి ప్రజా సౌజన్యానికి అనువుగా తీర్చిదిద్దగల ప్రతిభావంతులు ఉంటే భారతదేశం స్వర్ణ భారతదేశమవుతుంది.

భరతఖండం పౌరుల్లో పౌర నాయకుల్లో 10 శాతం మంది సత్యశీలురున్ననూ చాలు పూర్వపు ఔన్నత్యాన్ని పునరుద్భవింపచేయగలుగుతారు.

చెట్లను నరకుతూ, కొండలను పిండిచేస్తూ, పంటపొలాల్ను చేపల చెరువులుగా మారుస్తున్నంత కాలమూ పౌరునికి తినేతిండీ కట్టే గుడ్డా, వాసనయోగ్యమైన గూడూ లేకుండా పోయే ప్రమాదాన్ని ప్రజా నాయకులు కొని తేరని ఆశిద్దాం.

భారత ప్రధాని కలలు గంటున్న స్వచ్ఛ భారత్ నిర్మాణంలో మనమూ కలిసి నడుద్దాం. మన దేశ భవిష్యత్ మన చేతుల్లోనే ఉందనీ, అందుకై అహర్నిశలూ కృషి చేయాలని 2017లోని ఈ రోజు నుంచే ప్రతిన పూనుదాం. మన ముందున్న గోముఖ వ్యాఘ్రాలను తరిమేద్దాం. ●

ఆయన్ను 'తాతాజీ' అనేవారు
తాతాజీగా పిలిపించుకున్న రచయిత
తాపీధర్మారావు

సినిమా రచయితగా గానీ, 'కాగడా' పత్రికా రచయిత సంపాదకునిగానీ, ఆయన తరువాతనే మరొకర్ని చెప్పుకోవాలి. ఫిరంగుల వంటి మాటలు ఆయన సొత్తు. ఆయన వద్ద పనిచేసిన పత్రికా రచయితే ప్రసిద్ధ రచయితలయ్యారు

తాపీ ధర్మారావు పత్రికా సంపాదక జీవితంగానీ, చలన చిత్ర జీవితంగానీ, ఒక ప్రత్యేకతను సంతరించుకున్నదని చెప్పాలి. పల్లెటూరి పిల్ల సాంఘిక, భీష్మ పౌరాణిక చిత్రకథయైనప్పటికీనీ వాటి వాటి ఇతి వృత్తాలకు తగినట్లు కథాకథనం జరిగింది. సంభాషణల బాణీ రక్తికటింది.

పత్రికా రచయితగా జీవితం ప్రారంభించి 'కాగడా' పత్రికను ఆయనే ప్రారంభించారు. సంపాదకత్వం వహించారు. ఒకప్పుడు ఎంత పరమ ఛాందస గ్రాంధిక వాదో 1936 తర్వాత భాషాపరంగా, భావపరంగా ఎవరూ ఊహించని మార్పు వచ్చి వ్యవహారిక వాదాన్ని అంతగానూ సమర్థించారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోను రచనలు చేసారు. ఆయనలోని పట్టుదల, ఆత్మవిశ్వాసం, నమ్మినదానికోసం చివరివరకూ నిలబడడం... వంటి ఆదర్శనీయమైన లక్షణాలు కలిగిన కవిగా చరిత్రలో ప్రథమ స్థానం సంపాదించుకున్నారు. రచయితగా స్థిరపడ్డ తాపీ ధర్మారావు. చిన్న వయసులోనే ప్రతిభాశాలిగా గుర్తింపు పొందిన ధర్మారావు 19 సెప్టెంబర్ 1887న జన్మించారు. 8 మే 1973లో మరణించారు. చివరి రోజుల వరకూ సాహిత్య సేవ చేసిన అభ్యుదయ రచయిత ఆయన

ధర్మారావుని అందరూ ఆప్యాయంగా 'తాతాజీ' అని పిలిచేవారు. ఆ పేరుతో పాటు రకరకాల పేర్లతోనూ ఆయన రచన చేసారు. 1926లో ఊర్కాడు సంస్థానంలో ఉద్యోగం చేస్తున్న సమయంలో శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర భారతీ శంకరాచార్యులు ఆయనకు 'ఆంధ్రవిశారద' అన్న బిరుదును ప్రదానం చేసారు.

1907లో మద్రాసులోని పచ్చయప్పా కాలేజీలో బి.ఎ. చదవడానికి వచ్చిన దగ్గరనుంచి ధర్మారావుకి విడదీయరాని అనుబంధం ఏర్పడింది. కొంతకాలం ఉపాధ్యాయవృత్తిని చేపట్టినా చివరకు ఆయన పత్రికా రచయితగా, సినీ రచయితగానే స్థిరపడ్డారు. అలాగే 'జనవాణి' దినపత్రిక, 'కాగడా' వార పత్రిక (1940-42)లకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. 1937లో 'మోహినీ రుక్మాంగద' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. అప్పటి నుంచి అటు పత్రికా రచన, ఇటు సినీ రచనను సవ్యసాచిలా నిర్వహించసాగారు. చిత్రపరిశ్రమలో తను ఉన్న పాతికేళ్ల కాలంలో 37 చిత్రాలకు రచన చేశారు. వాటిలో కొన్ని చిత్రాలకు మాటలు, పాటలు కూడా రాశారు. 1962లో వచ్చి 'భీష్మ' ఆయన చివరి చిత్రం. 1954లో వచ్చిన 'రాజుపేద' చిత్రానికి నిర్మాణ పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

తొలి డాక్యుమెంటరీ చిత్రం 'మహాత్మాగాంధీ'కి వ్యాఖ్యానం రాసింది ధర్మారావే. ఆయన రచన చేసిన ఇతర చిత్రాలు 'సారంగధర' (1937), 'మాలపిల్ల' (1938), 'రైతుబిడ్డ' (1939), 'కాలచక్రం', 'ఇల్లాలు' (1937), 'అపవాదు' 'పత్ని (1941), 'కృష్ణప్రేమ' (1944), 'మావలీకు' (1945), 'గొల్లభామ' (1947), 'ద్రోహి' (1948), 'కీలుగుర్రం', 'దర్మాంగద' (1949), 'పల్లెటూరి పిల్ల' 'మొదటి రాత్రి' (1950), 'దీక్ష', 'మాయలమారి', 'తిలోత్తమ', 'మంత్రదండం' (1951), 'టింగురంగ', 'ఆడబ్రతుకు' (1952), 'రోజులుమారాయి', 'కన్నతల్లి' (1953), 'మా గోపి', 'అంతా మనవాళ్లే' (1954), 'ముద్దుబిడ్డ' (1956), 'పెద్దరికాలు' (1957), 'ఎత్తుకుపైఎత్తు', 'చెంచులక్ష్మి' (1958), 'ఎం.ఎల్.ఎ.', 'మా ఇంటి మహాలక్ష్మి' (1959), 'భీష్మ' (1962).

ధర్మారావుకి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు మోహనరావు, రెండో కుమారుడు గోపాలరావు. ఈయన 'బంగోరా' 'చాణక్య' పేర్లతో కథలు రాశారు. అలాగే 'చాణ్య' నాటకంతో టైటిల్ పాత్రను అద్భుతంగా పోషించడంతో మిత్రులంతా గోపాలరావు పేరుని కాస్తా 'చాణక్య'గా మార్చేశారు. తదనంతరకాలంలో ఆయనే అనేక చిత్రాలకు దర్శకత్వం వహించారు. హిందీ, తమిళ చిత్రాలకు దర్శకత్వం వహించి 'చాణక్య ది గ్రేట్' అనిపించుకున్నాడు. ●

సుమతీ శతకం

రూపించి పలికి బొంకకు
ప్రాపగు చుట్టంబు నెగ్గు పలుకకు మదిలో
గోపించు రాజును గొల్వకు
పాపు దేశంబు సారకు పదిలము సుమతీ!

భావం : సాక్ష్యాధారాలతో నిర్ధారాలతో నిర్ధారణ చేసిన అబద్ధమును నిజమని ఒప్పించే ప్రయత్నం, ఆప్త బంధువులను నిందించడం, కోపిష్టిని సేవించడం, పాపాలు చేసే ప్రాంతానికి వెళ్లడం ఎంతమాత్రం సరికాదు. ఈ విషయాలలో జాగ్రత్త అవసరం.

లావుగల వానికంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాడెక్కినట్లు మహిలో సుమతీ!

భావం : ఎంతో పెద్దదైన ఏనుగు బలంలో చిన్నవాడైన మావటికి లొంగిపోయి చెప్పినట్లు వింటుంది. అలాగే శారీరక బలం ఎంత ఉన్నా బుద్ధిబలం కలిగిన వాడే నిజమైన బలవంతుడు.

వఱదైన చేనుదున్నకు
కఱవైనను బంధుజనుల కడకేగకుమీ
పరులకు మర్మము సెప్పకు
పిఱికికి దళవాయితనము బెట్టకు సుమతీ!

భావం : వరద వల్ల మునిగిపోయిన పొలాన్ని మళ్లీ దున్నడం ఎంత మాత్రం మంచిదికాదు. అన్నం లేక అలమటిస్తున్నా బంధువుల దగ్గరకు వెళ్లడం కూడా సరికాదు. ఇతరుల రహస్యాలను ఎన్నటికీ వెల్లడి చేయకూడదు. పిరికి వాడికి సైన్యాన్ని నడిపించే పదవి ఎన్నటికీ ఇవ్వకూడదు. ●

ప్రేమ పిచ్చిది

వూరిలో ఉన్న జూనియర్‌కాలేజీలో చదువు పూర్తిచేసుకుని ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చేరింది సరయు. గవర్నమెంటు కాలేజీలో సీట్లు రాని వారందరూ కో ఎడ్యుకేషన్ ఉన్న ప్రైవేటు కాలేజీలోనే చేరుతుంటారు. కాలేజికి హాస్టల్ కూడా ఉంది. కాలేజీ తెరచి రెండు వారాలవుతోంది. కళాశాల అబ్బాయిలు, అమ్మాయిలతో కళకళలాడుతోంది. గలగల మాటలు నవ్వులు వినిపిస్తున్నాయి.

జాలు పరికిణీ, బుట్ట చేతుల జాకెట్టు, చెవులకి బుట్ట జిమికీలు, బంతుల జడతో నడుస్తున్న సరయును అందరూ వింతగా చూస్తున్నారు. ఆ అమ్మాయి ప్రక్కనే నడుస్తున్న అబ్బాయి 'ఉష్.. ఉష్' అన్నాడు.

సరయు తల తిప్పి అతనివైపు చూసింది

'నిన్నే మేడమ్' అన్నాడా అబ్బాయి.

'మేడమ్ అంటే నేను లెక్చరర్నా, స్టూడెంటు. లెక్చరర్ గెటప్ తేడా కూడా తెలీదా?' అంది సరయు.

'పోనీ పాపా అనేదా' అన్నాడా అబ్బాయి చిలిపిగా.

'వేళ్లు చీకుతున్న చిన్న పాపనా?' అంది వెటకారంగా సరయు.

'సరే.. మీ పేరేంటో చెప్పరాదా?' అన్నాడు.

'సరయు'

'మంచి పేరు పెట్టుకున్నారు'

'మంచితో చెడ్డదో.... నేనెవర్ని పేరు పెట్టుకోవడానికి. పేరు పెట్టింది మా అమ్మానాన్న. ఇంతకీ మీరు చెప్పనేలేదు" అంది సరయు.

'మీరు అడగలేదుగా?'

'సందీప్'

రోజులు గడుస్తున్నాయి. ఇద్దరి మధ్య చనువు పెరిగింది. త్వరలో సెలవులు ఇవ్వబోతున్నారు. కాలేజీ వదిలాక అదే పట్టణంలో ఉంటున్న తను పిన్ని ఇంటికి బయలుదేరింది సరయు. ఆమె వెంటే ఉన్నాడు సందీప్. ఇద్దరూ మాటలు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

'ఫస్ట్ ఇయర్ పరీక్షలు అయిపోయాక సెలవుల్లో ఏం చేద్దామనుకుంటున్నారు' అడిగాడు సందీప్

'మా మామయ్య వాళ్ల ఊరికిగి పోవాలనుకుంటున్నాను' అంది సరయు.

'నేను రానా, పోనీ మికిష్టం లేకపోతే మానేస్తా' అన్నాడు సందీప్

'అబ్బే అదేంలేదు. తప్పకుండా రండి' అంది సరయు

సందీప్ దారి మధ్యలో ఉన్న సాయిబాబా గుడి వద్ద ఆగిపోయాడు. సరయు తన పిన్ని ఇంటికి వెళ్లింది.

'ఇంత ఆలశ్యమయిందేమి' అడిగింది ఆమె పిన్ని లక్ష్మి.

'స్పెషల్ క్లాసు ఉంది పిన్నీ. అది అయ్యేప్పటికి ఈ వేళ అయింది' అంది సరయు బాత్‌రూంలోకి పోతూ

సరయు ముఖం కడుక్కుని వచ్చేటప్పటికి లక్ష్మి వేడి వేడి పకోడీలు ప్లేట్లో తెచ్చింది. వాటిని తిని నీళ్లు తాగి కాసేపు కబుర్లు చెప్పి లేచింది సరయు

'అప్పుడే వెళుతున్నావేం ఉండు' అంది సరయు పిన్ని.

'లేదు పిన్నీ ఆలశ్యమయితే మా వార్డన్ అరుస్తారు' అని వచ్చేసింది సరయు. నడచుకుంటూ సాయిబాబా గుడి వద్దకు చేరుకుంది. అప్పటి దాకా సందీప్ అక్కడే ఎదురుచూస్తున్నాడు. ఇద్దరకూ కలిసి సాయిబాబాను దర్శించుకున్నారు.

'చదువైపోయాక ఏం చేయాలనుకుంటున్నావు' అడిగాడు సందీప్.

'అనుకోవడానికి ఏముంది. మంచి ఉద్యోగం చూసుకోవాలి. నువ్వు.'

'నాకు అమెరికా పోదామని ఉంది. నువ్వూ రావా' ఆశగా అడిగాడు సందీప్

'నేను రాను. నాకు అమెరికా రావడం ఇష్టం ఉండదు. ఇండియాలో ఎంత దూరంలో ఉన్నా అమ్మానాన్నను చూడాలనుకుంటే వెంటనే బయలుదేరి రావచ్చు. అదే విదేశాల్లో ఉంటే వీసాలని, ఫ్లైట్ టికెట్లని రావడం వెంటనే కుదరదు. అందుకని నాకు ఫారిన్ అంటే ఇష్టముండదు' అంది సరయు.

సందీప్ మౌనంగా ఉండిపోయాడు.

మరో యేడాది గడిచింది.

ఓ రోజు సందీప్‌ను 'సరయూ నీకు ఒకే అయిందారా?' అడిగారు మిత్రులు.

'నాకేమో ఓకే అనే అనిపిస్తా ఉందిరా. నాతో చాలా చనువుగా ఉంటుంది. తనకు ఏ అవసరం వచ్చినా నన్నే సంప్రదిస్తుంది' అన్నాడు సందీప్.

'నీ ప్రేమ గురించి చెప్పవారా?' అడిగారు మిత్రులు

'చెప్పాను. తను మౌనంగా ఉంది తప్ప సమాధానంలేదు'

'మౌనం అర్ధాంగికారం. నీ ప్రేమ సక్సెస్‌లేరా' అన్నారు మిత్రులందరూ ఉత్సాహంగా.

* * *

మూడేళ్లు గడచిపోయాయి. ఫైనల్ ఇయర్ పరీక్షలు అయిపోయి ఫలితాలు కూడా వెలువడ్డాయి. సరయు డిస్టింక్షన్ వచ్చింది. సందీప్ అత్తెసరు మార్కులతో పాసయ్యాడు

'ఏం చేయాలనుకుంటున్నావు' అడిగింది అంజలి.

'ఏదైనా ఇక్కడే మంచి ఉద్యోగం చేసుకోవాలనుకుంటున్నాననే' అంది సరయు.

'పెళ్లి' అంటూ అర్ధోక్తిగా ఆపేసింది అంజలి.

'దాదాపు నిశ్చయమై పోయింది. మా మేనమామ గారి అబ్బాయి' అంది సరయు.

'సందీప్ కత ఏం చేశావ్?'

'నేనేం చేసేది..' అంది నవ్వుతూ సరయు.

'అతడు నిన్ను ప్రేమించాడు కదా..'

'నేను ప్రేమించాలి కదా'

'అయితే ఎందుకు అతని వెంట తిరిగావు'

'ఎక్కడ తిరిగాను'

'నీకు ఏ పని అవసరమైనా అతన్నే అడిగేదానివి'

'అవును. నాకు అన్నదమ్ములు లేరు. పల్లెలో అమ్మానాన్న ఉంటారు. అందుకని ఇతని సాయం తీసుకునేదాన్ని. అంతమాత్రాన అతన్ని ప్రేమించాలని లేదు కదా' అంది సరయు.

'అతను నువ్వు ప్రేమించావనే అనుకుంటున్నాడు. చదువులో కూడా బాగా వెనకపడ్డాడు' అంది అంజలి.

'అతనో ప్రేమ పిచ్చోడు వస్తాను' అంటూ వెళ్లిపోయింది సరయు. సరయూనే కళ్లార్పకుండా చూస్తూ ఉండిపోయింది అంజలి.

– బి. రామలక్ష్మి,

'నవ్య' వారపత్రికకు కృతజ్ఞతలు

చేయెత్తి జైకొట్టు తెలుగోడా!

తెలుగు అను మూడు అక్షరాలూ కలిసి ఉండాలి. కలసి ఉంటే కలదు సుఖమ్. అనుమాట కలలోని మాటయిపోయింది.

చేయెత్తి జైకొట్టు తెలుగోడా
గతమెంతో ఘనకీర్తి కలవోడా!
వీర రక్తపు ధార వార వోసిన సీమ! వెలనాడు నీదెరా? పలనాడు నీదెరా!– అనిన వేములపల్లి శ్రీకృష్ణ నినదించిన తీగలు తెగిపోయాయ్. బరంపురం వరకూ నీదేగా – అన్న తెలుగువాడు– తనది గాకుండా చేసుకున్నాడు. మద్రాసు నీదేరా! మధుర నీదేరా గాకుంటే తంజావూరు నీదేరా అను నుడికారంతో పాడుకున్న తెలుగువానికి తాంబరం వరకూ గల ప్రదేశంలో తెలుగుదనం వాడిపోయింది. అచ్చట తెలుగు వాడున్నాడు గానీ తెలుగు ఉనికి లేదు. పెళ్ళిచేసి చూపిస్తాం. పెళ్ళిపెద్దలనిపిస్తాం. బందరు నెల్లూరు హైదరాబాద్ మద్రాసు గిద్రాసు మదనం చేసి పెళ్లి పెద్దలనిపిస్తాం. రంగురంగులూ పూసల పల్లకీ బాకా బాజాడోలూ, సన్నాయ్ భజంత్రీలతో పెళ్లి జరిపిస్తాం. అన్నమాటలు సూదిబెజ్జమంత కూడా సోదికి రావడం లేదు.

వేములపల్లి శ్రీకృష్ణగారన్న చేయెత్తి జైకొట్టు తెలుగోడా! గతమెంతో ఘనకీర్తి కలవోడా వీరరక్తపు ధార వోసిన సీమ వెలనాడు నీదేరా, పలనాడు నీదెరా అన్న పూర్ణచంద్రకాంతలు పదానికి పూర్ణచంద్రగ్రహణం పట్టింది.

చంద్రగ్రహణానికి పట్టు విడుపులున్నాయ్‌గానీ తెలుగు కాంతి క్రాంతుల చంద్ర గ్రహణానికి పట్టేగాని విడుపు రాకుండా ఉన్నది. చెన్నయ్‌లో మాసపు రెండు పక్ష రాత్రులూ కృష్ణపక్షం రాత్రుల్లా తెలుగు వెల్తురు మసకబారుతూనే ఉన్నది.

ఇక్కడ వెలసిన పూర్ణశశాంక రాత్రినాడు కూడా పూర్ణ తెలుగు శశాంకుడు రాకుండా పోతున్నాడు.

రాకా సుధాకర! నీ రాక నిలిచి పోతుందేమయ్యా.

రాకరాక వచ్చావు చందమామా లేక లేక నవ్వింది కలువభామా! అని మా తెలుగు కవులు కట్టిన గేయ తోరణపు వెల్తురు రేకలు మసకబారుతున్నాయనెడి బాధ యెక్కువ ఉన్నది.

చేయ్యెత్తి జైకొట్టే తెలుగు వాడెక్కడున్నాడు

భాషా రాష్ట్రాల విడిబాటుతో యెక్కడికక్కడ చేతులను విరిచేసుకున్నాం. అక్కడున్న తెలుగువారు సాంప్రదాయ తెలుగును నేర్చుకోలేకపోతున్నామనే వేదననభవిస్తున్నారు.

భాషా రాష్ట్రంగా విడిపోనప్పుడు చెన్నపట్టణం (మద్రాసు) తెలుగు వారి సాహితీ కాణాచి. కళల కల్పవల్లి. నాలుగు భాషల వారి కళా సాహితీ కార్యక్రమాలూ ఇక్కడే జరుగుతూండేవి. నాలుగు భాషా చలనచిత్రాలూ ఇక్కడే నిర్మింపబడుతూండేవి. నాలుగు భాషా చిత్రాల నిర్మాతలు, నటులు, దర్శకులూ వివిధ సందర్భాలలో కలుస్తూనే ఉండేవారు. ఒకరి కొకరు తోడ్పడుతుండేవారు. జెమినీ స్టూడియో ఏవియం స్టూడియోలకన్నా మిన్నగా పధ్నాల్గు ఫ్లోరులతో వాహిని విజయా స్టూడియో వన్నె కెక్కింది.

చెయ్యెత్తి జైకొట్టే తెలుగుదనాన్ని ఎన్నో ప్రాంతాల్లో కోల్పోయాం. అక్కడక్కడున్న తెలుగువారు మాతృభాషా అమృతధారల్ని గ్రోలలేని స్థితిలో ఉన్నారు. కన్యాకుమారినుంచీ కాశ్మీరం వరకు ఏక (ఏకైక) భారతదేశంగా ఐక్యతా భావంతో ఉండాలన్న పటేల్ ఆశయాన్ని ఫలింపచేయలేదు. తుమ్ పూరబ్ హో! హం పశ్చిమ్‌హై– యనే శాంతా రామ్ చిత్రంలోని పాట గుర్తుకు వచ్చి, మీరు ఉత్తరాదివారు. మేము దక్షిణాదివారమనే భావన పొడసూపరాదు. హం ఏక్‌హై అందరూ ఒకటేనన్న భావన కలగాలి.

చేయెత్తి ఎక్కడ జైకొడతాం. గతమెంతో ఘనకీర్తి నెక్కడ చాటుతాం.

రాష్ట్రాల విడిబాటుతో మద్రాసులో వడప్పళణి కున్న ఆంధ్రా హాలీవుడ్ పేరు పోయింది. ఎర్రగా బుర్రగా తెలుగువారు కట్టిన భవనాలు నామమాత్రం ఉన్నాయ్.

గుంటూరు వాస్తవ్యులు, ప్రముఖాంధ్ర అభిమానులు శ్రీ డి. శంకరరావుగారి ప్రత్యేక వినతి

ప్రముఖాంధ్ర సెప్టెంబరు 2016 సంచికలోని 10వ పేజీలో ప్రకటించినవారి వ్యాసానికి నిరసన గుర్తుగా సిరా గీతలు పెట్టారు.

ప్రముఖాంధ్ర ఎవర్నీ కించపరచదు!

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌గారికి గోటేటి శ్రీరామారావుపై చిన్నచూపు ఉన్నదనెడి విషయం నేనెరుగుదును. అది వారి విజన్. రివిజన్ చేయడానికి యిష్టపడను. నా కంటికి అందరూ మంచివాళ్లుగానే కనిపిస్తారు.

ప్రముఖాంధ్రలో నేను ఆ దంపతుల ఉపాధ్యాయ ధర్మం గురించీ, వారి సేవా కార్యక్రమాల గురించి వ్రాసాను, అది ప్రముఖాంధ్ర యొక్క పారమార్థిక దృష్టి ధర్మం. నా ధర్మం ఎవరినీ ద్వేషించని ధర్మం. వారి సాహితీ సేవల్ను ప్రశంసించడంలో పరమధర్మాన్ని పాటించాను.

విషయం వచ్చింది కావున, మీకో నిజ సంఘటన చెప్పడం సమంజసమను కుంటున్నాను. ఎదురుపడినపుడు మంచిగానే మాట్లాడతారు. ఓసారి విశాఖ పట్టణంలో కలిసినపుడు 'బాగా ఉన్నారా?' అని అడిగారు. ఇరువురి ముఖాల్లోనూ సంతోష ఛాయలు పులకరించాయ్.

నేను మనిషిలో గల మంచితనాన్ని చూస్తాను. అంతర్ముఖంగా అతనిలో ద్వేషభావం ఉంటే పట్టించుకోను. బి.ఎస్సార్, కృష్ణ, ఎన్.ఆర్. చందూర్ ముచ్చరమూ మంచిమిత్రులం. పరస్పరమూ ప్రేమించుకునే స్వభావం కలవారం. మద్రాసులో ఉంటూనే తెలుగు భాషా సేవ చేసాం. అవిభాజ్యమైన స్నేహం మాది. నా భార్య గతించినపుడు వారు స్వయంగా వచ్చి ఓదార్చిన సందర్భం యింకా నా స్మృతిపథంలో ఉన్నది. మద్రాసులోనే గాక యావదాంధ్రుల హృదయాల్లోనూ స్థానం సంపాదించాను. వినయవిధేయతలు నాకు పుట్టుకతోనే వచ్చాయ్. ఇలాంటి విధేయతలు గల నేను కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆహ్వానంపై వెళ్లాను. వారు నన్ను మొదటి వరసలో కూర్చోపెట్టారు. (ఏ దేశంలో ఏ సభలకు వెళ్లినా నన్ను సాదరంగా మొదటి వరసలోనే కూర్చోబెడతారు)

ఆనాటి కృష్ణాజిల్లా సభలకు మాన్యులు పొత్తూరి వేంకటేశ్వరరావుగారు రావడం, యార్లగడ్డవారు వారిని సాదరంగా ఆహ్వానించడం వరకూ బాగానే ఉంది. కానీ మొదటి వరుసలో కూర్చున్న నన్ను యార్లగడ్డవారు వెనుక వరుసలోకి వెళ్లమని అనడం అసమంజసంగా తోచింది. పెద్దలపట్ల వినయ భావం గల పొత్తూరివారు నేను వేరేచోట కూర్చుంటానని వారిని అక్కడే కూర్చోనివ్వండి అంటూ వెళ్లారు.

మరోసారి ఇదే కృష్ణాజిల్లా పత్రిక రచయితల సంఘం వారు విజయవాడలోని ఓ ప్రఖ్యాత హోటల్‌లో సమావేశం జరిపినపుడు నేను వేదికపై ఉన్నాను. సహవేదికపై ఉన్నవారిని వరుసగా సన్మానం చేస్తూ, నన్ను సన్మానించడానికి వచ్చారు. అంతవరకు సభలో ఉన్న శ్రీమాన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, చటుక్కున వారి పత్రికా మిత్రుణ్ణి తీసుకుని వెళ్లిపోయారు. నేను బాధపడలేదు; కాని నా సన్మానం చూడడానికి వచ్చి నా శ్రేయోభిలాషులు ఈ విచిత్ర సంఘటననుచూసి ఎంతగానో బాధపడ్డారు. ఇదంతా ఎందుకు వివరించవలసి వచ్చిందో శంకరరావుగారూ మీరు గ్రహించే ఉంటారు. ఇది యార్లగడ్డవారి చులకనా భావం అని సరిపెట్టుకున్నాను. నేనెపుడూ చిన్నతనంగా తీసుకోలేదు. కొంతమంది అయిష్టులు అయిష్టంగా వర్తిస్తారని తెలుసున్నప్పుడు, హృదయం బాధపడదు. నా స్వభావమూ అంతే. ఎవరినీ కించిత్మాత్రం కూడా బాధపెట్టను. బాధపడను. ఇది నాకు తల్లిదండ్రులు, కుటుంబ వాతావరణం బోధించిన నీతి సూత్రం.

శంకరరావుగారూ! మీరెందుకు బాధపడతారు! బాధపడకండి.

జాతికోసం తపించు భాషకోసం పరితపించు

ఇవి నాగరిక లక్షణాలు. ఇవేవీ అనాగరికాలు కావు

నా భాషా నా సంస్కృతీ నా సాంప్రదాయం అనుకోవడం కూడా నాగరికమే. అన్యభాషలను ద్వేషించడం తప్పిదం. అమ్మభాషను ఉపేక్షించడం తప్పిదం. తన దేహం నా దేహం అని తపిస్తూ ఆరోగ్యంగా ఉంచుకోవడం ఎంతటి ఒప్పో నా భాషా, నా జాతీ అను భావం కలిగి ఉండటం కూడా అంతటి ఒప్పే.

ఎడతెగకుండా మన భాషా గ్రంథాలను చదవాలి. మన భాషా పారవశ్యం గ్రహించాలి. మన భాషలో జ్ఞానం సంపాదించాలి. ఎవరు ఎవరి మాతృభాషని భాషాజ్ఞానం పెంపుచేసుకుంటారో అవ్వారికి మాతృభాషా పరిజ్ఞానం కలుగుతుంది. వారు అవలీలగా ఏ భాషనైనా నేర్చుకోగలుగుతారు. వారి తల్లి భాషను విడిచి అన్యభాషను నేర్చుకోవాలనుకుంటే పోతపాలు త్రాగిన బిడ్డవలె శుష్కించి పోతారు.

నీ భాషా గ్రంథాలను చదువు. ఎడతెగకుండా చదివి, నీ భాషా జ్ఞానాన్ని పెంచుకోగలిగితే నీ జాతి ఔన్నత్యం అవగతమవుతుంది. నీ భాషలోని తీయదనమెంతో నీలో ఎంతటి ఔదార్యమున్నదో తెలుస్తుంది. నీ భాష అక్షర సంపదను ఎన్ని ఎన్ని భాషలకిచ్చినదో ఎన్ని అన్య సౌరభ్యాన్ని తనలో స్థానమిచ్చిందోనన్న ఉదారతనూ ఉత్తమ సంస్కృతినీ అర్థం చేసుకోగలుగుతావు.

మాతృభాషా మాధుర్యాన్ని ఆసాంతమూ ఆస్వాదించగలుగుతావు. నాగరికతా సాంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతీ ఒక పౌరుని ధర్మం.

మూడు కోట్లమంది తెలుగువారు పదమూడు కోట్లమందికి పైగా ప్రపంచంలో ఉన్నారని విన్నాను. వినిన దానిని బట్టి చూస్తే మంది పెరిగినప్పుడు మజ్జిగ పలుచపడుతుందన్న చందమో? ఏమో పలుకే బంగారమాయే కోదండపాణి యని రామదాసు రామచంద్రుని ప్రశ్నించాడు. పైగా తెలుగులోనే ప్రశ్నించాడు. తెలుగుపలికే తెలుగువారు తరిగిపోతున్నారు. ఎటుల ఎటుల వివరింతు పాండురంగ విఠలా? పదహారు వేలమంది గోపికల పెదవులూ కృష్ణా! కృష్ణాయని ఒకే నామం పలికినట్లు పదహారు కోట్లమంది తెలుగువారికి యస్ నో ఆల్‌రైట్ అనే మూడే ఆంగ్లముక్కల వలలో పడ్డారా?

జాతి కోసం తపించేవారు లేనపుడు ఆ జాతి తగ్గిపోతుంది. ఆ భాష మృతభాష అవుతుందంటున్నారు. అదెన్నటికీ కాదు. ఆ పలుకుల్లో వాస్తవం లేదు. తెలుగుభాష అమృతభాష. అతి మధుర భాష.

హిందూ దేశంలో ఎందరో దేవతలు అవతరించారు. భగవంతుడు ఎన్నో అవతారము లెత్తాడు. ఎందరో దేవతల్నిక్కడేనే అవతరింపచేశాడు. వారెన్నో మహత్కార్యాలను చేసారు. ముష్కరులను తరిమివేసారు. వీర విహారం చేసారు. మహా సామ్రాజ్యాలను నిర్మించారు. ఆ సేతు హిమాచల పర్యంతమూ పాలించారు. సత్యం, ధర్మం ఇక్కడే పుట్టింది. యాగాలు చేసారు. యజ్ఞాలు చేసారు. యోగులను ఆరాధించారు. యోగ్యులకు పట్టం కట్టారు; దౌర్భాగ్యులను తరిమివేసారు. శత్రువులను చెండాడారు. కానీ ఏంవిలాభం? ఉదారస్వభావం కల భారత రాజన్యులు నిశ్శత్రు దేశంగా తీర్చిదిద్దలేకపోయారు. వారి కరుణాపూరిత ఔదార్యం, శత్రుశేషాన్ని అలాగే ఉంచింది. శత్రుశేషం, ఋణశేషం ఉంచకూడదని మనుధర్మశాస్త్రం చెప్పిన దానిని పెడచెవిన పెట్టారు. జాతికోసం తపించినా, భాషకోసం పరితపించినా వారి ఔదార్య గుణం వారికే చేటు తెచ్చింది. పూర్వుల రక్తంలోని ఔదార్యం పున రుద్ఘాటితమవుతు పునఃపునః ఆపదల్ని తెచ్చుకుంటున్నాం. భగవంతుడా నీవే తిరిగి అవధనవతరించాలి. ●

'నవ్యత'కు నీరుపోసిన నవలామణి జలంధర!

'జలంధర' అనేసరికి తులసీ జలంధర జ్ఞాపకం రావచ్చు. తులసి తెలుగు వారి ఆరాధ్యత, ఆమె భర్త జలంధరుడు. ఇక్కడ ప్రస్తుతింప బడ్తున్న నవలా శిరోమణి శ్రీమతి 'జలంధర' వైద్య శిరోమణి గాలి బాల సుందరరావు గారి పుత్రిక. ఇంకా చెప్పాలంటే ఘట్టి పొట్టి సినిమా నటుడు చంద్రమోహన్ సతీ మణి. గాలి బాల సుందరరావు సుప్ర సిద్ధ వైద్యులు, రచ యితలకూ, కళా కారులకూ వైద్యుడు, నాటకాలకు అత్యంత ప్రియుడు, పోషకుడు. త్యాగరాజ నగర్‌లోని తన వసతి గృహ ప్రాంగణంలో 'స్టేజీ' కట్టి ఔత్సాహిక నాటకాలను ప్రోత్సహించిన అసమాన, అమేయ, అద్వి తీయ కళా పోషకుడు. ఆంధ్రపత్రిక అధినేత శివలెంక శంభు ప్రసాద్, పండితారాధ్యుల నాగేశ్వరరావు, ముదిగొండ లింగమూర్తి లాంటివారు రుగ్మత ఉన్నా, లేకపోయినా – రోజూ ఆయన్ను కలుసుకొనే వారు. ఇహ సినిమా నటులు ఔత్సాహిక కళాకారులూ చెప్పనే అవసరం లేదు.

ఆయనకు నాటకాలంటే వల్లమాలిన అభిమానం. ఆయన ఏకైక కుమార్తె జలంధరను అల్లారుముద్దుగా పెంచారు. పెంచి నందుకామె అల్లారుముద్దుగా తెలుగు సాహిత్యాన్ని ఔపోసన పట్టింది. చెన్నపట్టణం ఆమె పుట్టిల్లు. తల్లిపేరు మధురమీనాక్షి. ఈమె కళ్లు 'మీనాక్షి కళ్లు' వంటివే!

జులై 16, 1948 సం॥లో పుట్టినట్లు వినికిడి. పధ్నాలుగవ ఏటనే కథారగేట్రం చేశారు. మొదటి కథ 'అమ్మ' అని ఎరుక. 'ఆంధ్రప్రభ'లో అచ్చయిన కథ 'నాకథ' – 17వ ఏట వ్రాసారు.

నవలామణిగా ఎన్నో కథలూ, నవలలూ వ్రాసిన జలంధర నిగర్వియనే చెప్పాలి. గృహిణిగా బాధ్యతల్ని నిర్వహిస్తూనే రచయిత్రిలకు నచ్చిన రచయిత్రిగా వన్నెకెక్కిన ఈమె, తండ్రి సాహిత్యాభిరుచినీ, ప్రజ్ఞా ఉపజ్ఞలను పుణికి పుచ్చుకున్నారు, నిరాడంబరత ఈమె స్వంతమైనందున ఎక్కువగా విశ్లేషించి చెప్పకపోయినను, సాహితీ ప్రజ్ఞురాలని చెప్పగలం. ●

ఈమధ్య చెన్నైలో 9మంది రచయిత్రులు కలిసి ఆవిష్కరించిన పుస్తకావిష్కరణ సభలో జలంధరగారితో గోటేటి వెంకటేశ్వరరావు

తమిళనాడులో తెలుగు వికాసానికి అహరహమూ కృషి చేసిన సాధువరదరాజం పంతులు!

తిరునల్వేలి హల్వా కన్నా రుచ్చమైన మాతృభాష తెలుగుభాషను మాట్లాడుతూ, 'దయచేసి మన తెలుగువారందరూ తెలుగులోనే మాట్లాడండి'–అంటూ ఓ ప్రచారపట్టాను భుజానికి తగిలించుకుని కాలికిబలపం కట్టుకున్నట్లు నడుస్తూ కాలిక్రిందనున్న భూరేణువుల పొరల్లో కూడా తెలుగు భాష అక్షరాలు చొరబడేట్టు తమిళనాడు అంతటా తిరిగిన ఏకైక వీరుడు సాధువరదరాజం పంతులు.

తమిళనాట ఉన్న తెలుగువారికి తెలిసేట్టుగ తెలుగు పదాలను తమిళంలో వ్రాసి, యెలా ఉచ్ఛరించాలో బోధించిన మాతృభాషా బోధకుడు. చేత పెద్దబాలశిక్షను పట్టినట్లు, అవలీలగా తెలుగు అవగాహనమయ్యేట్టు శ్రమించిన ఏకవీరుడు.

ఈనాడు వయోజన విద్య అనేట్లు లక్షలూ కోట్లు తగలేస్తున్నారుగానీ, ఆనాడు పంతులుగారు అనాడంబరంగా తెలుగుభాషను మాట్లాడింపచేయడమే గాకుండా చదవడం, వ్రాయడం వంటి, 'విజువల్ ఎడ్యుకేషన్'కు ఆయనొక్కడే నడుముకట్టాడు. ఒక ఊరా, రెండూర్లా– తెలుగు వాళ్ళుండే ప్రాంతాలన్నీ తిరిగాడు.

'కృషితోనాస్తి దుర్భిక్షమ్' అన్నట్టు ఆనాడు నామావశిష్టంగా ఉన్న 'తెలుగు' తెలుగు వాళ్ళ నాలుకలపై లాలాజలంలా ఊరి, ఉబ్బి, ఉప్పొంగిపోయింది.

గలగలా పారింది గోదావరీ, వరదలొచ్చినప్పుడు ఊరి ఉరకలేసిందనట్టు తెలుగువారుండే తమిళనేలలో వరదలా వెల్లువలై ఎగసి ప్రవహించింది. తెలుగు అక్షరాల పంటను పండింపచేసింది.

గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరాబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
మురిపాల ముత్యాలు దొరలుతాయి– అని భూరేణువులన్నీ కలకలలాడాయ్. తెలుగు అక్షరాల పంటలు తమిళనాట పండాయి– అంటే ఆ ఘనత సాధు వరదరాజు పంతులుదే!

తోటివారంతా అపహాస్యం చేసారు. తెలుగు పిచ్చివాడన్నారు. ఆయన వీటివేటినీ పట్టించుకోలేదు. తమిళనాడులో కొడిగడ్తున్న తెలుగు దీపం జాజ్వలమానంగా వెలుగులీనాలంటే వరదరాజు పంతులువంటి మాతృభాషాభిమానులు మరలపుట్టాలి.

వరదరాజ పంతులుగారు తిరునల్వేలి జిల్లాలోని వీరరాఘవపురంలో సాధు రామకృష్ణయ్య పంతులు గారింట 1889 ఆగస్టు 20 తేదీన జన్మించారు. ఆయన ఎట్టియాపురం సంస్థానంలోని రాజుల వద్ద దివాన్‌గా పనిచేసారు. ఎట్టియాపురం రాజులు తెలుగువారు కావడం వలన, వారికి సాహిత్య కళాభిరుచి అమేయంగా కలవారవడం వలన– తెలుగు సాహిత్య సంగీతాలను రెండుచేతులా పోషించారు. ఆంధ్ర మహాభారతాన్ని తమిళంలో వచనరూపంలో అనువదింపచేసి ప్రచురించడానికి సహకరించారు. వారి తండ్రి రామకృష్ణయ్యపంతులుగారు సంస్థానంలో వివిధ శాఖల్లో ఉద్యోగం చేయడం కూడా వరదరాజు పంతులుగారు ఉభయభాషా సేవకెంతో ప్రయోజనం చేకూరింది. తమిళంలో అనర్గళంగా మాట్లాడడం, చదవడం, వ్రాయడం వారికి కరతలామలకమయింది. రెండు భాషలపై వున్న పట్టు రెండు భాషలల్లోనూ ప్రవీణున్ని చేసింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో తమిళం నేర్చుకుని తమిళ శబ్దకోశాన్ని తీర్చిదిద్దారు. ఆ విశ్వవిద్యాలయంలోనే ఓ చిన్న గుమస్తాగా ప్రవేశించి మేనేజర్‌స్థాయికి ఎదిగారు. ఉద్యోగవిరమణ వరకూ ఆ పదవిలోనే ఉన్నారు.

తమిళ నిఘంటువు కార్యాలయంలో పనిచేస్తున్నప్పటికినీ తెలుగు మీద అపారమైన వాత్సల్యం కలిగింది. తెలుగు మాట్లాడడం వచ్చినా– ఆయనకు వ్రాయడం, చదవడం రాదు; తెలుగు సాహిత్యంతో అసలు పరిచయం లేదు; అందుకాయన నిరుత్సాహపడలేదు. నిరంతర నిర్విరామకృషితో తెలుగు లిపిని చదవడం, వ్రాయడం నేర్చుకున్నారు. రోజూ ఆంధ్రదినపత్రికను చదువుతూండడం మొకటే ఆయనకు లిపి తెలిసింది. చదవడంతోబాటు, వ్రాయడం నేర్చుకున్నారు. తెలుగుశతకాలను బట్టీపట్టడం ప్రారంభించారు. కందుకూరి వీరేశలింగం రచనలు, భాస్కర రామాయణం, పోతన భాగవతం చదివే స్థాయి ఎదిగారంటే వారు అను దినమూ ఆంధ్రపత్రికను చదివేవారు. కాశీనాథునివారు ఆంధ్రపత్రికను అచ్చు తప్పులూ, అపభ్రంశలూ లేని పత్రికగా తీర్చిదిద్దడమే వారి తెలుగు ప్రామాణికతకు కారణం, ఆంధ్ర పత్రికను దినదినమూ చదువుతూ, ఇంట్లోనివారికి ఆ పత్రిక భాషా శైలిని చెప్పేవారు.

వరదరాజు పంతులుగారి భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు శివసుబ్రహ్మణ్యం అలా నేర్చుకుని ఆంధ్రభాషలో ప్రావీణ్యతను సంపాదించారు. వారూ పంతులు గారితోబాటు తెలుగు భాషా వ్యాప్తికి బహుముఖంగా కృషి చేసారు. ఊరూరూ, గుమ్మగుమ్మమూ యెక్కి తెలుగు భాష వ్యాప్తికి విశేష కృషిచేసిన వాడు వరదరాజు పంతులని యిప్పటివారికి తెలియకపోవచ్చు. తమిళనాడులో చాలా మంది తెలుగు వారున్నప్పటికినీ, వారికి తెలుగు అక్షరం చదవడం రాదు; వ్రాయడం అసలే అలవాటు లేదు.

తంజావూరులోని మహారాష్ట్రులకు తెలుగు అంటే ఎంతో ఇష్టం. తెలుగు వాక్యాలను తమ లిపిలో వ్రాయించుకుని చదివేవారు. ఆంగ్లేయులు సంస్కృతాన్ని రోమన్‌లిపిలో ముద్రించుకునేవారు. బ్రౌను వంటి తెల్లదొరలకు తెలుగు అంటే చాలా యిష్టం. తెలుగు పండితుల్ని చుట్టూ ఉంచుకుని తెలుగును నేర్చుకున్నారు. ఆయన పండితుల్ని పిలిపించుకుని వ్యాకరణమునే సంస్కరించారు.

వరదరాజు పంతులుగారి అనన్యకృషితో తమిళనాడులోని తెలుగు భాష యాసనే మరచిపోయి అచ్చతెలుగులో మాట్లాడారంటే– అది వరదరాజు పంతులు అనన్య కృషేనని చెప్పాలి. ఆయన్ను ఆనాడు దక్షిణాంధ్ర పితామహ, భాషోద్ధారక అను అనేక బిరుదములిచ్చి గౌరవించారు. 1972 సంవత్సరంలో 83 యేట ఆయన కాలధర్మం చేశారు. ఇప్పటికీ ఆయన ప్రాతఃస్మరణీయుడే! ఇలా మాతృభాషా వ్యాప్తి కోసం భుజంపై సాహితీ సారస్వాన్ని తగిలించుకుని ప్రచారం చేసిన మహోదాత్తుని పేరు నేను వినలేదు. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని – చెన్నై
044 25204046, 26171341

We Provide your comfortable Stay and Tasty Food Hospitality
Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

కవి, ఋషి, యోగి, క్రాంతదర్శి అష్టాదశ పురాణకర్త వ్యాస ముని!

వ్యాసుడే విష్ణువు, విష్ణువే వ్యాసుడు' అంటారు. విష్ణువాంశ సంభూతుడే వ్యాసుడు. మహాభారత, భాగవతములనే గాకుండా, అష్టాదశ పురాణములను వ్రాసిన కవి పుంగవుడు, ఋషి, యోగి, ముని, క్రాంతదర్శి. ఆయన కుటుంబ చరిత్రే మహాభారతం ఆయన తన దీర్ఘ దృష్టితో ఊహించి, రచించిన గ్రంథం ఒక రకంగా ధర్మశాస్త్రంబని చెప్పవచ్చు, వేద ధర్మానుసార గ్రంథం, అందుకే మహాభారతం పంచమవేదమైంది. అట్టి అమ్మహాగ్రంథకర్త గురువులకు గురువు మహాగురువు. పీఠాధిపతులందరూ భక్తి శ్రద్ధలతో గురుపూజను వ్యాసపూజగా చేయడం జరిగింది. ధర్మగ్రంథాల ఉద్ధారకుడాయన. నిజమైన యోగి, సాధు పుంగవుడు షడ్షణలకు తావులేని సాధు జీవితమునే నెరపాడు.

పరాశర సత్యవతులకు సద్యోగర్భమున జనించినవాడు వ్యాసుడు. లోక హితార్థం కారణజన్ముడుగ జన్మించాడు. తండ్రి సంకల్పానుసారంగా తపస్సుకు వెడుతూ–తల్లి సత్యవతికి నమస్కరిస్తూ – 'అమ్మా' దిగులు పడవద్దు, మీరు పని కలిగి ఎపుడు నన్ను స్మరిస్తే అపుడు మీ దగ్గర ఉంటాను 'అమ్మా!' అంటూ తల్లి అనుజ్ఞగొన్నాడు. కృష్ణ ద్వీపానికి తరలి వెళ్లాడు.

లోక హితాన్ని కోరుతూ తపస్సును చేస్తూనే వేద విభాగాన్ని చేస్తూ, పురాణ వ్యాసాంగం కొనసాగిస్తూ శిష్యశ్రేణికి శిక్షణ యిస్తూ, కాలహరణం కానివిధంగా లోక కళ్యాణమే ధ్యేయంగా ధర్మ సంస్థాపనార్థం వ్యాసంగాలు కూరుస్తూన్న సమయంలో తల్లి సత్యవతి తలచుకుంది. వెంటనే తల్లి ముందు కనబడ్డాడు. నాయనా–కురు వంశం అంతమయ్యే సమయమాసన్నమైంది. భీష్ముడు తన ప్రతిజ్ఞను వీడి, పెండ్లి చేసుకోనంటున్నాడు. నీవెలాగైనా కురువంశాన్ని నిలిపే ప్రయత్నం చేయాలని అర్థిస్తుంది. రాజ్యం అరాచకం గాకుండా సత్వర ప్రయత్నం చేయాలంటుంది. సాలోచన చేసి అంబా అంబాలికలను అనుగ్రహిస్తాడు. కానీ వారి భంగిమలను బట్టి అంధుడైన ధృతరాష్ట్రుడూ, పాండురోగి యైన పాండురాజూ కలుగుతారు. వారిని జూచి నిట్టూర్చిన సత్యవతి మరోమారు వ్యాసుణ్ణి స్మరిస్తుంది. ఈసారి అంబాలిక తనకు మారుగా దాసీని పంపిస్తుంది. దాసీ పుత్రునిగా విదురుడు జన్మిస్తాడు.

ధృత రాష్ట్ర, పాండు రాజులకు వివాహములు కావడం, గాంధారికి నూరుగురు కుమారులూ, ఒక కుమార్తె, కుంతికి ఐదుగురు కుమారులు కలగడం, వారు పెరిగి పెద్దయినట్లుగానే వారి మధ్య వైరమూ వయసు పెరిగినట్లు పెరగడం జూచి వ్యాసుడు వ్యాకులపడతాడు. ధృతరాష్ట్రుణ్ణి మందలించినట్లుగా గాకుండా, ఉప దేశించినట్టు సలహాలు యిస్తాడు.

అలాగే ఆయన పాండవులు లక్క గృహంలో బంధించి నపుడు కుంతీ పాండవులకు ప్రత్యక్షమై ఏకచక్రపురం వెళ్లమనీ, అర్జునుడు మత్స్య యంత్రం కొట్టినపుడు, బ్రాహ్మణ బ్రహ్మచారియైన పార్థుని జూచి, ద్రౌపదిని యివ్వడానికి సందేహిస్తున్న ద్రుపదుణ్ణి జూచి, పాండవుల విషయం, అలాగే ద్రౌపది పూర్వ వృత్తాంతం చెప్పి అన్నదమ్ములయిదుగురికీ పాణిగ్రహణం చేయించడంలోనూ వ్యాసుని దూత్యం ఉన్నది.

పాండవులకు శ్రీకృష్ణుని తోడు లభించేవరకూ వ్యాసుడే సహకరిస్తూ వచ్చాడు. ధృతరాష్ట్రుణ్ణి కురు పాండవుల్ని సమదృష్టితో చూడమని చెప్పడంలోనూ ఆయన కర్తృత్వం వహించాడు. కానీ తన మాటలను పెడచెవిని పెట్టాడని ఎప్పుడూ బాధపడలేదు. కురుక్షేత్ర సంగ్రామం ముగిసిన తరువాత ధృతరాష్ట్రుణ్ణి ఓదార్చడానికి వచ్చాడు. అటు తరువాత చని పోయిన తన బిడ్డల్ని చూడగోరుతున్నానని అన్నప్పుడు కౌరవు లందర్నీ సాక్షాత్కరింపచేశాడు. అతణ్ణి వైరాగ్యసంపణ్ణు కావించినదీ వ్యాసులే! దుష్టులను శిక్షించాలనీ, శిష్టులను రక్షించాలనీ భావించి, పాండవులు రక్షింపబడేట్టు,



కౌరవులు శిక్షింపబడేట్టు ధర్మసంస్థాపనా దృష్టి చూపినదీ వ్యాసుడే. ఆయన ఊహించిందే మహాభారత సంగ్రామం. ఇన్నీ చేసిన ఆయనకు పుత్రప్రేమపై దృష్టిపడింది. దైవాన్ని వేడి శుకుణ్ణి పుత్రునిగా పొందాడు. సత్పుత్రుడు కలిగినందులకు పొంగిపోయాడు. అతడు తండ్రికి తగినట్టుగానే పెరిగాడు. భవబంధాలు ఇష్టంలేని అతడు ఒకసారి తండ్రిని మోక్షమార్గం ఉపదేశించమని కోరాడు. ఇందుకు తగినవాడు రాజర్షి జనక మహారాజుయనీ, ఆయన పూర్ణ పురుషత్వాన్ని శ్లాఘిస్తూ, జనకుని వద్దకు పంపిస్తాడు.

కృష్ణుణ్ణి పరిపూర్ణ అవతార పురుషునిగా గ్రహించి దర్శించింది వ్యాసుడే! దైవబోధలైన వేదాల్నీ, పురాణేతిహాసాల్నీ గ్రంథస్థం కావించిందీ ఆయనే! ఆయన కారణంగానే భవిష్యత్తరాలకు అపార విజ్ఞాన సంపద అందింది. జ్ఞాన సంపన్నులు పెరిగారు. గురువులకు గురువైన ఆదిగురువుగా, పరమ యోగిగా, శాంతచిత్తునిగా, మహర్షిగా వ్యాస మహర్షిని కీర్తిద్దాం; వ్యాస భగవానునిగా ఆరాధిద్దాం. ●

Beautiful City - Beautiful Hotel

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రాజకీయులకు వినతి!

అంతరాలను పెంచవద్దు! ఆంతర్యాల మధ్య చిచ్చు రేపవద్దు!

దేశం నానాటికీ కృష్ణపక్షపు చీకట్లలోకి దూసుకుని పోతూంది. దేశమనెడి దొడ్డవృక్షం ప్రేమలనెడి పూలెత్తవలెనోయ్

-అన్న మాట జనం పెదాల మీదకు కూడా రావడంలేదు. బాధ్యతకల వ్యక్తులు సహితమూ దుర్భాషలను ఆడుతున్నారు, దౌష్ట్యపరులౌతున్నారు.

ఆనాడు ఒక వేర్పాటు జిన్నా, హింసాత్మకపు రజాకర్లు ఉన్ననూ, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ (సరిహద్దు గాంధీ బిరుదాంకితుడు) వంటి సఖ్య ప్రదాతలైన ముస్లిము నాయకులుండేవారు- ఈనాడలాటి వారున్నారా అనే సందేహం పొసగడమే గాకుండా హిందూనాయకుల్లో సహితమూ హిందూ ద్వేషాలూ, అగ్రకుల ద్వేషాలూ విషనాగుల్లా బుసలుకొడ్తూ- సమాజ సఖ్యతకు విఘాతం కల్పిస్తున్నారు, సౌభాతృత్వాన్ని సహితమూ నశింప చేస్తున్నారు.

విషనాగుల్ని సహితమూ పూజించి, సంతోషంతో స్పందిం పచేసిన ఈ దేశంలో తోటి మానవులే సాటి విషనాగులై విషం గ్రక్కడం, మనుషుల్ని మిడతల్లా మాడ్చివేయడాన్ని చూస్తుంటే ఇది అసుర సంస్కృతికన్నా హీనంగా తోస్తూన్నది.

నిత్యమూ సెకను సెకనుకూ కాశ్మీరులో జనం దహింప బడ్తున్నా, ప్రభుత్వం ప్రేక్షక వీక్షకులుగా ఉండడం పేడి తనమేమో అనిపిస్తున్నది. పైగా ఆ అగంతక, దురంతక వర్గానికే దాసోహమంటూ- రిజర్వేషన్లు కల్పింపచేయడం స్వకుచ మర్దనంగా కనిపిస్తున్నది.

సంస్కృతీపరంగా, సంపద పరంగా, సాంప్రదాయ పరంగా మేధాశీల పరంగా, భారతదేశ ప్రభుత్వం, పౌరనాయకులు తమ వారి కళ్లను తామే పొడవడం చూస్తూంటే- వీరు రాబందులు కన్నా హీనులౌతున్నారే అన్న వేదనా, ఆవేదనా కలుగుతున్నది. రాబందులు పార్థివ శరీరాలపై తప్ప ప్రాణ శరీరాల మీద పడి, చంపవు, తినవు. ఈ తీవ్రవాదుల కేఁవిరోగం- వారి మతం గానీ మత ప్రవక్తలు గానీ ఏవైనా హింసను ప్రబోధించారా, లేదే? బలవంతపు మత మార్పిడిల కొడంబడ మన్నారా, ఏ మతమైనా మంచినే బోధించింది. కాశ్మీర్‌లో మన వీరజవానులుపై రాళ్ళు రువ్వడం, స్కూళ్ళను తగులబెట్టడం, పోలీసులను ముట్టబెట్టడం చూస్తూంటే ప్రభుత్వం తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచకపోతే మనం చాలా నష్టపోవడం ఖాయం. ●

ప్రతీ తెలుగు ఇంటా తెలుగు నీతి బోధశతకాలూ పెద్ద బాలశిక్షా ఉండాలి! తల్లీతండ్రీ బోధించాలి!!

తెలుగు మాతృభాషగా కలవారంతా, తెలుగును భాసింపచేయాలంటే, తమ తమ ఇండ్లనందు నిరతమూ తెలుగునే భాషించాలి. ప్రతి ఇంటి పెద్దలైన తల్లీతండ్రీ తమ పిల్లలకు పెద్దబాలశిక్షనూ, నీతి శతకాలను బోధించాలి. కనీసం సుమతి, భర్తృహరి, వేమన, దాశరథి శతకాలనైనా బోధించాలి. అప్పుడే తెలుగు నవనవోన్మేషంగా వికసిస్తుంది; తరువాత తరాల వారికి తెలుగు అందించబడుతుంది. తెలుగు సభలు పెరుగుతున్నాయ్. అష్టావధాన, శతావధానాల్లో చూపే ఉత్సుకత సాహితీ సమావేశాల్లో కనపడడం లేదు. సినిమా తారలూ, సినిమా డాన్సులు అంటే ఎగబడుతున్నారు. ఆ డాన్సుల్లో తెలుగు తనం ఉందా, ఆ పాటల్లో తెలుగు సంస్కృతీ భూత సాహిత్యం ఉందా-అంటే రెండూ పూజ్యమే! జాతినీ, సంస్కృతినీ, సాంప్రదాయాన్నీ, సాహిత్యాన్నీ పతనం కావించే సినిమాలే హెచ్చుగా వస్తున్నాయ్. వాటికే జనం ఎగబడుతున్నారు.

తమ తరువాత తరాల వారు సాంప్రదాయబద్ధమైన జీవితాన్ని సాగించాలంటే తెలుగు సంస్కృతిలోని గొప్పదనం, తెలుగు భాషలోని ఔన్నత్యం తెలియబరచాలీ అంటే నీతిశతకాలూ, పెద్ద బాలశిక్షలు తక్క వేరు మార్గం లేదు. మిగతావాటిలో తెలుగు లేదు. గుళ్లూ గోపురాలు సందర్శించడంతోనే సరిపెట్టుకున్నా 'వెలుగు' రాదు. రామాయణ, భారత, భాగవత గ్రంథాలను చదవాలి. పూర్వపు పెద్దల త్యాగనిరతనూ, దేశభక్తినీ తెలుసు కోవాలి.

పాఠ్య పుస్తకాలు చదవడం వల్ల, ఉత్తీర్ణులు కావడమూ, ఉపాధిని సంపాదించు కోవడమే జరుగుతుంది గానీ జ్ఞానం సిద్ధించదు. ఇహ ఉద్యోగాల నిమిత్తార్థం దేశాలు పట్టి పోయేవారు, తమ పిల్లలకు మాతృభాషను నేర్పే అవకాశం లేదంటు న్నారు. ఇది పచ్చి అబద్ధం. ఇంటిలోని తమ పిల్లలతో తెలుగులోనే మాట్లాడుతూ, తెలుగులో కల పెద్దబాలశిక్షనూ, నాలుగైదు నీతి శతకాల్లోని పద్యాలనూ నేర్పించాలి. రామాయణ, భారత, భాగవత పురాణ గాధల్ని చెబుతూండాలి. ఆ పిల్లలు పరిసర వాతావరణం కారణంగా ఆంగ్లమూ, ఆంధ్రేతర భాషలను మాట్లాడినప్పటికినీ, తాము వారితో తెలుగులోనే మాట్లాడాలి. తమ పూర్వులను గురించిన విశేషాలు, తమ ప్రాంతం గురించిన విశేషాలూ చెప్పాలి. ●

ఆంగ్లము ఎంత అవసరమో తెలుగు అంత అవసరం!

పోతపాలు బిడ్డ వంటి వాడు తెలుగు రానివాడు. తల్లిపాలతో పెరిగిన బలవర్ధకపు జీవి తెలుగు వాడు. బ్రతుకు తెరువు తెలుగు అనవసరమే కావచ్చు కానీ బ్రతుకు సార్థకతకు మాత్రం తెలుగు అవసరం.

చందమామ రావే జాబిల్లి రావే
కొండెక్కి రావే కోటిపూలు తేవే
బండెక్కిరావే బంతిపూలు తేవే
అన్నీయుతేవే అమ్మాయికివ్వవే
అన్న తెలుగు పాటలో కల మాధుర్యం
'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్
హౌ ఐ వండర్ వాట్ యు ఆర్'లో రాదు. 'వాట్ యు ఆర్' అన్నట్టుగానే సంతృప్తి ప్రశ్నగానే మిగిలిపోతుంది.

ఉద్యోగ ఉపాదుల కోసం ఆంగ్ల విద్యను నేర్చుకోవడంలో తప్పులేదు. భృతికి నేర్చుకోవాలి. కానీ బ్రతుకిచ్చిన తల్లి, మాతృభాషామ తల్లి తెలుగు తల్లి. ఆమె ఋణం తీర్చుకోవడానికి మాతృభాషను విడనాడరాదు. ఎన్ని సభలు చేసినా, ఎన్ని సభలకు వెళ్లినా మాతృభాషరాని లోటు లోటే! చాలా తెలుగు సభల్లో చూస్తున్నాం. ఇంగ్లీషులోనే మాట్లాడతారు. ఏమంటే తాము దేశాలు పట్టి తిరగడం వల్లనో, సభలో ఉన్న చాలామంది తెలుగు వారికి తెలుగు రానందువల్లనో ఇంగ్లీషులో మాట్లాడుతున్నామనే కుంటి సాకు చెబుతారు. విదేశాల్లో ఉంటే మాత్రం తమకు మూలం తెలుగే కదా! తమ తల్లి తండ్రులు తెలుగు నేర్పలేదా-వారికీ తెలుగు రాదా- అలాగయితే ఎంతో డబ్బు ఖర్చు పెట్టి తెలుగు సభలకు వెడ్తున్నవారూ-'ఓ వంద రూపాయలు' ఖర్చుపెట్టి ఓ పెద్దబాలశిక్ష, రెండు నీతి శతకాలూ చదువుకోండి. ఇంటి వద్దనే తెలుగు నేర్చుకోండి, మాట్లాడండి, ఇంట్లోని వారితో మాట్లాడి, మాట్లా డించండి. అదీ చేయని మీరు, మాతృభాషకు కావాలని ద్రోహం చేస్తున్నవారే! ●

పేర్మిగల ఆంధ్ర నాట్యం పేరణి

భరత నృత్యపరంగా, ఆంధ్రుల సంస్కృతీ పరంగా ఎన్నో నృత్యాలు, సంగీత ఫణతులూ కాలగర్భంలో కలిసిపోయిననూ, కొందరు పురాతన గ్రంథాలను పరిశీలించి పునర్జీ వింపజేసి తధానురూపంగా పునఃసృష్టి చేస్తున్నారు.

ఈ మధ్యకాలంలో వెంపటి చిన సత్యం, శైవా, నటరాజ రామకృష్ణ, రాజారెడ్డి ప్రభృతులు వారికి వారు తదానుగుణంగా నాట్యాన్ని తీర్చిదిద్దుతూ, జాతీయాంత ర్జాతీయ ఖ్యాతినొందారు. వారు వస్తుగుణ విశిష్టతనూ, గురూత్వాన్నీ మదిలో పొంది కొందరు తారలు వెండి తెరమీద కూడా ప్రఖ్యాతిగొన్నారు.

ఇటీవల కొన్ని తెలుగు సభల్లో నటరాజ రామకృష్ణగారు 'పేరిణీ శివతాండవం' పేరిట– తమ శిష్యులచే చేయించిన ఈ నృత్య బాలెను చూశాను. ఆంధ్ర నాట్యం పేరిట కూడా ఆ 'బాలే'ను ప్రదర్శిస్తున్నారు.

నాట్యం నటరాజు సొత్తు, శివుని విశ్వరూపం, పరమేశ్వరుని ఆనందమయ తన్మయత్వం. శివతాండవమని కూడా అంటాం. కానీ ఈ పేరిణీ నృత్యం 'ఆఉఅం' అను శక్తిమయ 'ఓం' కార నాదంతో, ప్రారంభమై ఉచ్చస్థాయిలోనే ఉగ్ర మహోగ్ర తాళయుక్తంగా,ఊర్ధ్వ ఉచ్ఛస్వర లయబద్ధంగా ప్రారంభమవుతూ, పదగజ్జెల సవ్వడి శబ్దం ఆరోహరణ స్థాయిలో ప్రారంభింపబడ్తుంది. ఐదు అంగాలుగా పేరిణి – గర్షం, విషయం, భావా శ్రయం, కైవారం. గీతంలతో బాటు, శివ పంచముఖ శబ్దవర్తనం, భ్రమణ నర్తనం, ఏకాదశ రుద్రనర్తనం, గంగావతరణం అనేవి ప్రాధాన్యత వహించిన నర్తనాంశాలు.

ముందుగా నేను వివరించినట్లు, ప్రారంభ పరమేశ్వర పంచముఖ శబ్ద నర్తన ప్రదర్శనం మనల్ని మంచి దృష్టిలో నిలుపు తుంది. నృత్య ప్రదర్శన స్థాయి కన్నా, మనం చూచే దృక్కుల స్థాయే ఘనంగా ఉంటుంది.

పృధ్వి ఆపస్తేజో వాయురాకాశ సంభూతమైన జ్యోతిర్లింగాల స్తోత్రగానం, తద్గనుగుణమైన నృత్యభంగిమలు చేస్తూన్నపుడు ఆ మృదంగాది వాయిద్య శబ్దాలు ఆ పంచభూతాత్మక స్థితిలోనికి మనల్ని తీసుకునిపోతాయ్, ఓ విధమైన, వైవిద్యమైన శివాగమ నృత్య స్థాయికి నర్తకులు వెళ్లిపోతూ, ముందు కూర్చున్న ప్రేక్షకుల్ని సహితమూ ఆ స్థాయికి గొనిపోవడం విశేషం. మృదంగ శబ్దానికి అనువైన చందోబద్ధ కవిత్వంలో గానం కొనసాగడం, మార్ధింగుల 'తాదాత్మకత' మనల్ని రసస్ఫూర్తిల్ను కావిస్తుంది. అంతర్ధ్వనిలో ఓంకారనాదం అంతర్వాహిని కావడం ఈ పేరిణీ శివ తాండవ నృత్యానికీ, ఆంధ్రుల శాస్త్రీయ నాట్యం అన్న మకుటానికి రత్నఖచిత మకుట ప్రాయంగా వరలింది.

ప్రతీ నర్తకుడూ ప్రత్యేక స్థాయిలోకి గొనిపోబడినవాడే, ఒకరి కెక్కువ మరొక రికి తక్కువ గాకుండా బృందంలోని నర్తకు లందర్నీ ఒక స్థాయిగలవారిగా తీసుకొని పోవడంలో నటరాజ రామకృష్ణగారు గైకొన్న అమేయ ప్రతిభాసంపత్తి అపూర్వ విశ్లేషణ. సప్త తాళ సమన్విత వాయిద్య ప్రదర్శనం, జతులు విన్యాసాలూ వృత్తులూ ప్రబంధయుతంగా కనిపిస్తాయ్.

'పేరిణి'లోని మరో అంతర్నృత్యం శృంగి నృత్యం, నాద వికాసాన్నీ, ధ్వని ప్రాధాన్యతనూ, నాట్య ఛందస్సుతో బాటు, పద్య ఛందస్సులను సహితమూ శాస్త్ర నిబద్ధతకు నిలుస్తాయ్.

నాస్తికుల్ని సహితమూ ఆధ్యాత్మికానుభవముతో ముంచెత్తే అపూర్వ నాట్యం పేరిణి నాట్యం.

పాల్కురికి సోమనాధుని 'పండితారాధ్య చరిత్ర' లోనూ, శ్రీనాథుని కాశీఖండం'లోనూ, 'భరతార్ణవం' అనే గ్రంథాలలోని పేరిణీ నృత్య లక్షణాలను శోధించి, పరిశోధించి, కాకతీయ గణపతిదేవుని బావమరిదీ, సైన్యాధ్యక్షుడైన జాయపసేనాని రచించిన నృత్య రత్నావళి గ్రంథంలోని 'పేరిణి' నృత్య వివరాల నుండి కూడా నటరాజ రామకృష్ణ విశేష కృషితో ఈ 'పేరిణి నృత్యాన్ని' పూరణ చేశారని అంటారు.

ఏడెనిమిది వందల సంవత్సరాల క్రిందటి యీ పేరిణి నృత్యం శిల్పభంగిమలను సేకరించి, ఆహార్యం దుస్తులు అలంకరణల విషయంలో శ్రద్ధతీసుకోవడం కూడా యీ నృత్యానికి ఓ నూతనత్వాన్ని చేకూర్చింది. వేగవంతమైన యీ యుగంలో 'పేరిణి' వంటి వేగవంత నృత్యాలు మరింత ఆకర్షణ కలుగచేస్తాయ్.

వేదాంతబద్ధంగా యీ సృష్టి త్రిమూర్తీ స్వరూపమని, అవనిలో ఎక్కడెక్కడ వీచిన వాయువులోనూ ఓంకారమే ప్రతిధ్వనిస్తుందనీ, ప్రతీ పదశబ్దానికీ గల ఛందస్సంబంధ సూత్రాల్లోని నిబద్ధతతో, ఆరంభం ఉత్పత్తి, మధ్యలోనుంచే ఆరోహణ మార్గంలో పరాకాష్ట చెంది, అహరోహణా మార్గంగా నాదం అంతర్ధానమౌతూ లయకారకుడైన ఆ శివునిలోనే లయమవుతుందన్న మూల సిద్ధాంతాన్ని 'పేరిణి'లో తీసుకుని రంగవల్లికలు (ముగ్గులు)గా దిద్దారు గనుకనే అందర్నీ ముగ్ధుల్ని చేస్తూన్నది. నటరాజ రామకృష్ణకు అంజలి ఘటిస్తూ, ఆంధ్రుల కళాప్రతిభను చాటుతుందీ 'పేరిణి', పేర్మిగల పేరిణి. ●

Compliments from

Sri Krishna Bhat

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464